


# ఏక్ దిన్ కా...

"హుష్! ఆగండి" రాజు చెయ్యి ప్రమీలకడ్డంగా చాపాడు. ప్రమీల ఒక్కఉదుటున ఎగిరి రాజు వెనకాలనుంచి రెండుచేతులూ పట్టుకుని భుజంమీంచి తొంగి చూచింది. అక్కడ వారికి ఎదురైనదృశ్యం....

ఓ అందమైన సాయంకాలం. గాలితో గడుసు దెయ్యాల్లాంటి గోధుమరంగు మేఘాలు యీదుతున్నాయి. ఆకాశానికి మశూచి వచ్చిందాన్నట్టు మచ్చలు అక్కడక్కడ నీలంగా కనబడుతున్నాయి. రెండు కొండల మధ్య సూర్యుడు అచ్చం బొమ్మల్లో మాదిరి 'పోజు' కొడుతున్నాడు, కృష్ణ నీలి అద్దాల్లో అందం చూసుకుంటూ. 'డాం' నుంచి కూలివారంతా 'ఓరెంకటసామి' పాటలు పాడుతూ హుషారుగా యింటికి తిరిగొస్తున్నారు.

పెద్దరాతిబండమీద కూర్చొని కంప్రెసర్ భీషణ సంగీతాన్ని వింటున్న రాజు మెదడ్లో పైన చెప్పిన వన్నీ మఠం వేసుక్కూర్చున్నాయి. రాజుకి మొదట్నుంచి మేఘాలు, కొండలు, సెలయేరు, చందమామ మలయపవనంలాంటివంటే మహా యిష్టం. వాటిని చూస్తుంటే అత నలా అలా గాలిలోలేచిపోయి, ఆకాశపు వెండి మైదానాలమీద పరుగెత్తి, ఏడురంగుల ఆర్చి వంతెనలమీద నీలి అఖాతాల్నిదాటి చందమామని ముద్దుపెట్టుకోగలడు.

సూర్యుడు ఆకాశపు పడమటి కొసలమీద పసుపు, కుంకమ రంగుల్ని ఎగబోస్తున్నాడు. మరో చివర నల్లటి మేఘాలు గాలి కెరటాలమీద తేలుతున్నాయి. ఎండి, చిక్కిన కృష్ణ తన కడ్డుగా నిలబడ్డ మొరటు బండల్ని తప్పించుకుంటూ ఒదిగి పారుతోంది.

"వ్హాట్ ఎ బ్యూటీ!" అనుకున్నాడు రాజు.

(ఇంగ్లీషురానివాళ్ళకి వీలుగా "ఓహో ఏమి అందం!" అని తెలుగులో కూడా అనుకున్నాడు.)

"గలగలని వీచు చిరుగాలి గెరటమై
జలజలనిపారు సెలపాటలోదేటనై......"

రాజు పెదాలపైన అనుకోకుండానే పాట 'మర్మరి'ల్లింది. రాజు అమోఘంగా పాడగలడు. వెన్నెల రాత్రులు సముద్రపు హోరుకిలయగా అతను పాడిన పాటలెన్నిటప్నో పాంబీచ్ రాతి గుట్టలు తిరిగి వప్పజెప్పాయి.

కొండ మలుపులో జీపు హారన్ పలికింది. రాజు తీయని కల చెదిరిపోయింది. రాజు హాట్ సరిజేసుకుని, చేతులో పైలుగట్టిగా పట్టుకుని కూలివారికి పని చెప్పటం మొదలుపెట్టాడు, ఒక కంటితో జీపుని కనిబెడ్తూ.

జీపు వెళ్ళిపోతోంది. జీపులో రావు! రావు కూడా తన మాదిరి యింజినీరే! అయితేనేం! తను ప్రొద్దున్న ఏడింటినుంచీ పన్నెండింటిదాకా గాలువుసుమేస్తే అత నే వాన్‌లోనో ఎనిమిదింటికి పని మీదికి వెళ్ళి పదింటికల్లా యింటికెళ్ళిపోతాడు. తను సాయంకాలం అయిదున్నరదాకా పనిమీదనే నిలబడిపోతే, అతను మధ్యాహ్నమంతా గాలి పంకాలక్రింద వట్టివేళ్ళ తడకల మధ్య చల్లగా కూర్చొని ఏదో కాగితాలమీద బరుకుతూంటాడు.

రాజుకి యీమాదిరి అన్యాయా లెన్నిటప్నో తమాషాగాచేసే దేవుడిమీద చాలా కోపం వచ్చింది.

"మనమంతా బానిసలం! గానుగలం, పీనుగులం! వెనకదగా, ముందుదగా! కుడి యెడమల దగా, దగా" రాజు కీసారి పాట రాలేదు. కసిగా వచనమే పలికింది.

లేబరు పని కట్టేసి నెమ్మదిగా యిళ్ళకి జారుకుంటున్నారు. రాజుకి కదల బుద్ధేయలేదు. అలా కొండ అంచున నిలబడి, క్రిందనంతనీ క్రేన్ షాట్‌లో చూస్తూ, యింకా చాలాసేపు నిల్చోవాలనిపించింది. సూర్యుడు పూర్తిగా దిగిపోయాడు. యిదే సమయమన్నట్టు నల్లమబ్బులు పైన నిండా ఆవరించుకున్నాయి. నీలిమచ్చలు నల్లగా మారాయి.

ప్రకృతి అందమైన అమ్మాయిలాఉంది. ఆ అమ్మాయికి ఎన్నో వంకర్లు తిరిగిన వాలుజడలా ఉంది కృష్ణ. ఈ చదును లోయ, కొండలు, అడివి — అంతా ఓ మహాకవి చెప్పినట్లుంది. రాజు తనకి తానే కవిత్వం చెప్పేసుకుంటున్నాడు.

ప్రకృతి తనని పిలుస్తోంది అనిపించింది రాజుకి. అనిపించేంతలో, ఆమే తనకేసి రాసాగింది. ప్రకృతి! నిజంగానే! రాజొకసారి కళ్ళు నులుముకు మరీ చూశాడు. చుట్టూ ఎవరూలేరు. అంతా సద్దణిగిపోయింది. ఆ అందాన్ని ఎలెక్ట్రిక్ లైట్లు యింకా పాడు చేయడం మొదలు పెట్టలేదు.

ప్రకృతి తనకేసే నడిచొస్తోంది. "హాహా" అనుకున్నాడు రాజు యీలపాటలాగ.

కృష్ణలాగే అష్ట వంకర్లు తిరిగిన వాలు జడ రేగి ఉంది. గాలికి చీర వెనక్కి ఎరుగుతోంది. మొగం వాడిఉన్నా, యిందాక చూసినంత అందంగానూఉంది. అడుగులు నీరసంగా పడుతున్నాయి, కొండంతా ఎక్కివచ్చిన మూలాన. రాజుని పట్టరాని ఉత్సాహం ఆవేశించింది.

"ఓహో, నవసాంధ్యసమయమల్లీ మనోజ్ఞ కుసుమకామిని!" అని పద్యంలాగ చదివేశాడు.

అమ్మాయిఆగి అడిగింది.

"యీ పైకి టూరిస్టు బస్ ఏదైనా వెళ్ళిందాండి?"

రాజా ప్రకృతి ముఖంలోకి పరికించి చూశాడు. మాసి యీలోకపు నాల్గు గోడల మధ్యకు చేరుకున్నాడు. చేరుకుని అన్నాడు —

"నేను చూడలేదు"

అమ్మాయి కళ్ళు నిరాశ, నిస్పృహతో నిండిపోయాయి.

"మీరెవరో తెలుసుకోవచ్చా?" ఇంగ్లీషులో అడిగాడు రాజా.

"నేను హైదరాబాదునుంచి వచ్చానండి. మా కాలేజీ వాళ్ళమంతా కలిసివచ్చాం ప్రొద్దుట. సాయంకాలం, డాం చూద్దామని యిటువైపు వచ్చాం. నే నెక్కడో చూస్తూ నిలబడ్డాను. ఎప్పుడు వెళ్ళిపోయారో వాళ్ళంతా బయల్దేరి వెళ్ళిపోయారు. అక్కడెవర్నో కనుక్కుంటే ఏదో క్రొత్త బస్సు యిలా పైకి వచ్చిందన్నారు. మాదేమోనని......" బాధగా నెమ్మదిగా అంది ప్రకృతి (ప్రస్తుతానికి ప్రకృతనే పిలుద్దాం. అసలు పేరు మనకీ తెలియదుగా!)

"మీ పరిస్థితిచూస్తే జాలేస్తోంది. నేను మీకేమన్నా సహాయం చేయగలనా, మిస్ ప్రకృతీ!"

"నాపేరు ప్రకృతని మీకెవరు చెప్పారు? నా పేరు ప్రమీల."

"సారీ. నన్నేం చేయమంటారు?"

"నాకీ చోటేదీ బొత్తిగా తెలియదండి. కాస్త మా వాళ్లెక్కడి కెళ్ళారో కనుక్కుంటే, మీకు చాల ఋణపడిఉంటాను" అమ్మాయి వాళ్ళ గురించిన వివరాల్ని చెప్పింది.

గాలి దుమారం లేచింది. ఎండిపోయిన ఆకులు, చెత్త, దుమ్ము అన్నీ మూప్పై నలభై అడుగులు పైకిలేచి నాట్యం చేస్తున్నాయి. మనుష్యులు ముందుకు కదలడానికే కష్టమవుతోంది. ప్రమీల శరీరం మలచుకున్న వంకరల్ని తాకుతూ గాలి ఆమె ప్రొఫైల్ని అత్యద్భుతమైన శిల్పం మాదిరి చూపెడుతోంది. అది చూసిన రాజా, "యీమె రంభ, ఊర్వశి, మేనక. తిలోత్తమ, మేరిలిన్ మన్రో, జేన్ మాన్స్‌ఫీల్డ్,లిజ్ .టేలర్,ఎలియనార్ పార్కర్‌లాంటి దేవకన్యలు, అప్సరసలు జాతిలోదికాదుకదా అని ఆశ్చర్యార్థకం మార్కుమొగం పెట్టాడు.

"అసలు మీవాళ్ళ గొప్పతనాన్ని మెచ్చుకోవాలండి. ఒక శాల్తీ తప్పిందన్న విషయం ఎంతమాత్రం గుర్తులేకుండా ఎలా వెళ్ళిపోగలిగారో!"

"దాంట్లో ఓ గొడవఉందిలెండి. మా కంటింజెంట్—ఇన్—ఛార్జికి నేనంటే వేళాకోళం జాస్తి. నామీద జోకోటి ప్రయోగించి ఉండవచ్చు."

"పోనీ మీరయినా అంత చూడకుండా ఎలా ఉండగలిగారు?"

ప్రమీల కొంతసేపు మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా, ఆగుతూ చెప్పింది:

"నేనూ కొంతమందీ కలిసి ఆ కట్టనిచ్చిన



దీనినుంచి 'డాం' పైకెక్కాం. అక్కడ్నించిచూస్తే— ఆ కొండలు, మధ్య చలనం లేకుండా అద్దంలా ఉన్న నీళ్ళు, వాటిలో నీలి ఆకాశం, పచ్చటి మబ్బులు, ఓవైపు కనుమలో దిగజారుతున్న ఎర్రటి సూర్యుడు దూరాన్నుంచి సిలోవెట్లులా కనబడుతున్న లేబరు బారుగా నిలబడి ఆయినపబొచ్చెల్ని ఒకరికొకరు అందించుకుంటూ పదాలు పలుకుతున్న పిల్లలు— నేను కేంద్రంగా నాచుట్టూ తిరిగే యీ సౌందర్య వలయాల్ని చూస్తుంటే, ఏదో చెప్పలేని ఆనందం తన్మయం, ఓమధురానుభూతి నన్ను నింపేసింది. ఏమిటో అలా నిలబడిపోయాను. ఎంతసేపు నిలబడ్డానో, వాళ్ళంతా ఎప్పుడెళ్ళిపోయారో నాకు తెలీదు. పెద్ద యింజను రొద నన్ను యీ లోకపు హద్దుల్లోకి లాక్కొచ్చింది. వెనక్కి తిరిగి చూసేసరికి ఎవరూలేరు."

రాజుకి నవ్వొచ్చింది, ఆ కవిత్వంవింటే.

"వాన కూడా వచ్చేట్టుంది, యీ మబ్బుల్ని చూస్తే. రండి, ముందర పైకెళ్దాం. ఆ తర్వాత చూసుకోవచ్చు మిగతావన్నీ"

రాజు వెనకాలే అడుగులు వేసింది ప్రమీల తప్పనిసరిగా. కాని, నాలు గడుగులు వేసేసరికే గునపాలు గుచ్చుతున్నట్లు వాన చినుకులు పడసాగాయి. లైట్లు వెలిగాయి రోడ్డుమీద.

"తొందరగా నడవండి. ఈ ప్రక్కన రెస్టుహవుస్‌లోకి చేరుకుందాం." రాజు ప్రమీల గబ గబా అడుగులువేసి రెస్టుహవుస్‌లోకి చేరుకున్నారు.

వాన ఎక్కువైంది, హోరుమంటూ. ప్రమీల హృదయాకాశంలోనూ నల్లటి మబ్బులు దట్టంగా అలుముకున్నై. "ఏందారి!" ప్రమీల గుండెల్లో మబ్బులు అదే ప్రశ్నని కుండపోతగా కురిపిస్తున్నాయి. బయట వాన దారిలేదన్నట్టు వింత రొద చేస్తూ, తన ప్రతాపం చూపెడ్తోంది.

విపరీతమైన గాలి, వాన కలిసి రొంయ్‌మంటూ వింత సంగీతాన్ని పుట్టిస్తున్నాయి. ప్రమీల కిదంతా సినిమా బ్యాగ్రౌండు సంగీతం లాగుంది. ఇది గంట పైగా నడిచింది. నెమ్మదిగా వాన తగ్గుముఖం పట్టింది. దూరంగా రాళ్ళని ఒరిసిపారే నీళ్ళ రొద తప్పించి అంతా నిశ్శబ్దం. ఆ రొద ప్రమీల హృదయంలో విషాదసంగీతంలా ప్రతిధ్వనించింది.

రాజు "కన్నప్పా!" అని పిలిచాడు.

దూరంగావున్న షెడ్డులోంచి కన్నప్ప బయటికొచ్చాడు.

"ఎవరు!.......మీరాసార్! యిలా వచ్చారేంసార్!" కన్నప్ప ప్రమీలనిచూసి గతుక్కుమని తడబడూ అడిగాడు.

"గొడుగుంటే యియ్యి"

"ఉందిసార్" కన్నప్ప కాసేపట్లో గొడుగు తెచ్చియిచ్చాడు.

"రండలా పైకి వెడ్దాం. ఈ రాత్రి కెలాగో తలదాచుకుంటే రేపటి సంగతి రేపాలోచిద్దురుగాని."

వేరేదారిలేని నిస్సహాయతలో, ప్రమీల నెమ్మదిగా బయటికి అడుగులు వేసింది. కాలవ ప్రక్క దగ్గిర దారినిపట్టాడు రాజు.

"ఈ గొడుగు వేసుకోండి, తడుస్తే కష్టం" రాజు గొడుగందించాడు ప్రమీలకి.

"మీరు మాత్రం తడవడమెందుకు? మీరు పట్టుకోండి" తను గొడుగుక్రిందికి జేరుతూ అంది ప్రమీల.

"అబ్బ! ఎంత లోతు!" అదిరిపడింది ప్రమీల కాలవ ప్రక్కన అడుగువేసి.

"ఆత్మహత్యకి సులభసాధనం!" ఆ కాలవలో పడి ఎంతమంది ఎప్పుడెప్పుడు చనిపోయిందీ, అంతా వివరంగా చెప్పుకొచ్చాడు రాజు.

"నిజానికిలాంటి స్థలాలు చాలా ఉన్నట్టున్నాయే యిక్కడ! ఆత్మహత్య చేసుకోదల్చుకున్న వాళ్ళకి స్వర్గమన్నమాట యిది!" ప్రమీల నవ్వింది.

చెత్తపోగుల మధ్యనుంచి రోడ్డెక్కి యిల్లు చేరుకున్నారు చివరికి. ముందర యింటిచుట్టూ నాలుగడుగుల యెత్తున రాతిగోడ. దానికో చిన్నగేటు. గోడనానుకొని గుబురుగా మెట్ట తామర మొక్కలు. వాటిప్రక్కనే లైనుగా చిన్న క్రోటన్లు. ఆ లోపల లాను లానుమధ్య దూరదూరంగా గులాబీ, బోగన్‌విల్లి, నైటుక్వీను మొక్కలూ, గేటు కెదురుగా మూడడుగుల వెడల్పున యిసుకబాట. దానికి రెండు వైపులా గుబురుగా పెద్ద క్రోటన్లు. ముందు

కొడుకు:-నాన్నా! నేచెప్పిన పని నీవు చేయగలవా?

తండ్రి:-(నవ్వుతూ) ఆ మాత్రం చేయలేనా? ఏదీ చెప్పు చూద్దాం?

కొడుకు:-ఐతే నీజేబులోని రెండు రూపాయలు తీసి నా జేబులో వెయ్యి చూద్దాం.

వరండా చుట్టూ, కిటికీల కెదురుగానూ తీగలు— రాజు యిల్లు సినిమా సెట్ లాగుంది.

"ఇదేదో ప్రేమ విహార్‌లాగుందే!" ప్రమీల తనలో తాననుకొని బయట నిలబడింది తటపటాయిస్తూ.

"ఇమామ్! పంతులింటికివెళ్ళి కారియర్‌తెచ్చి రెండు మీల్సు పట్టుకురా. నాలుగు కుర్చీలు లాన్లో వెయ్యి. బకెట్‌నిండా నీళ్ళు పట్టు. గదుల్లో లైట్లు వెయ్యి— అరె! అక్కడే నిలబడిపోయారే! రండి లోపలికి" రాజు గబగబ ఆర్డర్లు పంపిణీ చేసేశాడు.

"నేను వెళ్ళాలండి. ఏదైనా బస్ దొరుకుతుందేమో!" ప్రమీల బుద్ధిమంతురాలయిన మంచి పిల్లలాగ ఉహూ యిదైపోయింది

"మీరలా తంటాలుపడి లాభంలేదు. యిప్పుడు డప్పుడే ఎనిమిదయింది. యిక్కడినుంచి ఎక్కడికీ ఏ బస్సూ దొరకదు, హిల్ కాలనీకి తప్పిస్తే. అక్కడికివెళ్ళి మీరు చేసేది, అన్నంతిని ప్రాజెక్టు హవుసులో పడుకోడమేగా! అది యిక్కడే చేయొచ్చు నిరభ్యంతరంగా. నేనుండడం మీకేమైనా అడ్డమయితే యీ రాత్రికి ఆ ప్రక్క మా స్నేహితుడింట్లో ఉంటాను. మీరు ఫ్యాన్‌చేత ఏంకావాలో తెప్పించుకుని నిశ్చింతగా పడుకోవచ్చు" దండకంలాగ చదివేశాడు రాజు.

మేఘాల మల్లిపందిరినుంచి పూలలాపడుతున్నాయి చినుకులు. మబ్బు చాటు చందమామ మసక మసగ్గా కన్పిస్తున్నాడు. ఇంటిముందు గడ్డి మధ్య పూలు ఉండిపొమ్మన్నట్టు తల లాడిస్తున్నాయి. కాదనలేకపోయింది ప్రమీల.

"నేనింక వెళ్ళనా మరి!"—రాజు.

"ఇది మరీ బాగుంది. నేను వచ్చానని మీరు వెళ్ళిపోవడమెందుకు? ఫర్వాలేదు......నాకా మాత్రం విశ్వాసం ఉందిలెండి!"

"థాంక్స్"

"నేనే మీకు చెప్పాలి."

*            *            *

ఆ రాత్రి బయట లాన్లో పడుకున్న రాజుకి చాలా కలలొచ్చాయి. వాటన్నిట్లోనూ తను నాయకుడు. ఆమె నాయిక. తను కృష్ణుడు, ఆమె రాధ. తను రోమియో ఆమె జూలియెట్, తను షాజహాన్, ఆమె ముంతాజ్.......యిలా ఎన్నో మహా ప్రేమికుల జంటల్ని జ్ఞాపకం తెచ్చుకుని మరీ కలలుగన్నాడు రాజు. చివరి కాండ "కాలాయణం'లో తను నాయుడు బావ ఆమె యెంకి.

"రెక్కలతో పైకెగిరి సుక్కల్లెదిగుతాది —
కొత్త నవ్వుల కులుకు కొత్త మెరుపుల తళుకు!"

ప్రమీల మెరుపులా తళుకుమంది వరండా బయట. రాజు కళ్ళు జిగేల్ మనడంతో నులుముకునిలేచాడు. ప్రమీల అప్పటికే పూర్తిగా తయారయి ఉంది చుట్టుప్రక్కల యిళ్ళలో అమ్మాయిలు యింకా కళ్ళాపు మొదలు పెట్టనేలేదు.

"నేనింక వెళ్తానండి మీకు చాలా ఇబ్బంది కలిగించాను క్షమించండి."

"అరె! మీ డిక్షనరీలో వెళ్తానన్నమాట తప్పించి మరోటి లేదేమిటి"

"అది కాదండి. మీ మంచితనాన్ని యింకా వాడుకోడం ఏమంత మర్యాదగాదు!"

"ఇలా చూడండి, మీరెంతోదూరంనుంచి యిక్కడికి వచ్చారు. ఏదో చూద్దామనుకున్నారు. అసలేదీ చూడకుండానే వెళ్ళిపోతారా! పైగా యిప్పుడప్పుడే ఆరు దాటింది. మొదటి బస్ వెళ్ళిపోయింది. యిక తర్వాత మీకు దొరికేది పన్నెండున్నర డీలక్సే. మిగతా బస్సు లేవీ అంత వీలుగా ఉండవు. ఎలాగ అప్పటిదాకా ఆగదల్చినప్పుడు సాయంకాలందాకా ఉండి చూడదల్చుకున్నవి రెండూ చూసి రేపు, ఉదయాన్నే అయిదూ యాభైఅయిదుకి డీలక్స్‌లో బయల్దేరవచ్చుగా! తిన్నగా భోజనం వేళకి యింటికి జేరుతారు. బాగా ఆలోచించుకోండి. ఆ తర్వాత మీ యిష్టం".

చిలక విన్నట్టు వింది ప్రమీల. ఫలితం రాజు తెచ్చిన జీపులో కొండకి బయల్దేరింది.

"ఈ విశాలమైన లోయంతా పెద్ద కోనేరయిపోతుంది. ఈ యెర్ర అద్దుడు కాగితంలాంటి లోయ మధ్య దూరంగా సిరామచ్చలా కనబడుతోంది చూడండి—అదే నందికొండ పల్లెటూరు. అవూరు ఎక్కడో నాలుగు వందల అడుగుల లోతున నీట్లో ఉంటుంది. యీ మధ్యనున్న చిన్నకొండ కూడా మునిగిపోయేదే! యికమీదట నాగార్జునకొండ కెళ్ళాలంటే యీ కోనేటిలో లాంచీలమీద ప్రయాణం చెయ్యాలి!.......వరసగా చెప్తున్నాడు.

"అమ్మో! ఎంత పెద్ద పెద్ద పుట్టలో! అందులో పాములుంటాయాండి!"—పదడుగుల యెత్తు పాం




# ఏక్ దిన్ కా....

(35-వ పేజీ తరువాయి)

"ముమ్మాటికీ కాని అలారండి. అటువచ్చి చూస్తే సీనరీ గొప్పగా వుంటుంది.

ఇద్దరూ జలపాతం దగ్గిరకి వెళ్ళారు. కొండ పైనుంచి క్రిందదాకా మెట్లున్నాయి. మెట్లమీద నీళ్ళుపడి తెల్లగా దొర్లుతున్నాయి. దూరంగా సన్నటిలోయ. లోయనిండా డొంకలు డొంకల మధ్య పాడుపడ్డ గుడి. చుట్టూ తీగలు ఎదురుగ్గా క్లిఫ్ పైన రెస్టుహవుస్ కనుచూపు మేర ఎక్కడా నాగరికతకి చిహ్నాలనదగినవి లేవు. బహుశా రెస్టుహవుస్ మినహాయిస్తే అంతా నిశ్శబ్దం. ప్రశాంతంగా ఉంది. క్రిందపడుతున్న నీళ్ళు ముత్యాల సరుల్లా సన్నగా తెల్లగా ఉన్నాయి.

"యిలా కూర్చుందాం రండి కాసేపు" అంటూనే ప్రమీల కూర్చుంది. రాజా దూరంగా చతికిలబడ్డాడు. రాతి చివర.

"అంత చివర కూర్చున్నారేమిటి, పడేందుకు! యింకా కొంచెం యివతలికి రండి."

"ఫర్వాలేదులెండి క్రిందబడితే మీరున్నారుగా కబురందజేసేందుకు."

"ఛీ! ఏం మాటలవి!"

"ఏముంది? ప్రస్తుతం నాకూ పరలోకానికీ దూరం ఒక్క అడుగు మాత్రమే"

"ప్రస్తుతమేమిటి? ఎప్పుడూ అంతే. కాలంలో ఒక అడుగు గడిచాక మనకేం జరుగుతుందో ఎవరు చెప్పగలరు?"

"చాలా పెద్దపెద్దమాటలు మాట్లాడుతున్నారు మీరు.మీరేంఅనుకోకపోతేసి సిగరెట్టుకాలుస్తాను".

"కాల్చుకోండి. అంత బాగా అలవాటా మీకు!"

"ఈమధ్యే అలవాటు చేసికొన్నాను. రెండు వందల యాభై సంపాదిస్తూ, కనీసం రోజుకి అర్థణా అయినా కాల్చకపోతే యెందుకని, ఓ సిగరెట్టు చొప్పున కాలుస్తున్నాను."

"మీ ఆర్గ్యుమెంటు బాగుంది."

అంతేనండి. సిగరెట్టు ని చూస్తే నాకు బోలెడు తత్వం పుట్టుకొస్తుంది. జీవితం సిగరెట్టులాంటిది. దాన్ని కొందరు రెండు వేపులా కాల్చేసి త్వరలోనే ఆర్పేసుకుంటారు. యింకొందరు అంటించీ అంటించనట్టుంచి అలా పారుస్తూ గంటసేపు తగలెడతారు.

"మీరేం చేస్తారు."

"నేనేం చేసినా, చెప్పేది మాత్రం ఒక్కటే. దాన్నలా చేత్తో బట్టుకుని ఊరికే కొడి రాల్చుతూ కూర్చోక ఉన్నంతలో నాలుగు దమ్ములు గట్టిగా పీల్చి అవతల పారెయ్యమని.....రండి అలా పైకెళ్ళి చూద్దాం."

యిద్దరూలేచి పైన ప్రశాంతంగా నిశ్చలంగా ఉన్న నీళ్ళ దగ్గిరకి వెళ్ళారు. రాళ్ళమీద చీరకొసలు పైకెత్తి నెమ్మదిగా అడుగులు వేస్తున్న ప్రమీల ప్రతిబింబాన్ని నీళ్ళలోచూసి గుర్రాజుగుండె గుబగుబలాడింది.

రాతి చివర నీళ్ళు పడుతున్నాయి క్రిందికి. క్రింద పదడుగుల దిగువన మరో రాతిపైన నీళ్ళుపడి చింది యింకా యాభై అరవై అడుగుల దిగువకి పడిపోతున్నాయి. ఆ అడ్డుమీదపడి చిందే నీటి బిందువు ల్లోంచి సూర్యుడు వాలు కిరణాలు పోవడంతో చిన్న ఇంద్రధనస్సు వంగింది, ఆ రాతిపైన. నీటి తుంపరలు గాలి కెగురుతూంటే ఇంద్ర ధనస్సు కూడా గాలిలో ఊగుతోంది నల్లమేఘాల కొసల్ని సూర్య కిరణాలు తెల్లగా కాల్చేస్తున్నాయి. ప్రమీల కళ్ళు ఇంద్రధనుస్సుల రంగుల్లో తగ్గ్మస్తి్తూ వాయి. ఆమె మనస్సులో అలాంటి యింద్రధనుస్సులు లెక్కలేనన్ని విరుగుతున్నాయి. ఏకాంతం. ప్రశాంత వాతావరణం. ఆమె మనస్సు రెక్కలు గట్టుకెక్కడికో ఎగిరిపోయింది.

"ఇక్కడే ఎప్పటికీ ఉండిపోతే. " అస్పష్టంగా అన్నది ప్రమీల.

"భోజనానికి ప్రొద్దున్నా, సాయంకాలం మాచర్లపోయి వస్తూండాలి." రాజా జవాబు.

ప్రమీల ఆకాశపు టెత్తులోంచి యీ లోకపు లోతుల్లోకి జారిపడింది. యిద్దరూ కలిసి వెనక్కి బయల్దేరారు, తాత యిచ్చిన కాఫీ తాగి.

చీకటి పడుతోంది క్రమంగా. రాజేదో ఆలోచనలో మౌనంగా తలవంచుకు నడుస్తున్నాడు ప్రమీల ముందుకీ, వెనక్కీ, ప్రక్కకీ రాజుకేసీ చూస్తూ సన్నగా పాడుతూ వయ్యారంగా నడుస్తోంది.

"హుష్!ఆగండి"రాజ చెయ్యిప్రమీలకడ్డంగాచాపాడు."

"అయ్యబాబోయ్!" ప్రమీల ఒక్క ఉరుకున ఎగిరి రాజా వెనకాలనుంచి అతని రెండు చేతులూ పట్టుకుని భుజంమీంచి తొంగిచూచింది.

పదడుగుల పొడుగు నాగుబాము రోడ్డుకడ్డంగా చుట్టలు చుట్టుకుంటూ, విప్పుకుంటూ చల్లగాలికి ఆడుకుంటోంది మధ్యగా

"ఎలాగ అవతలి కెళ్ళడం?" నెమ్మదిగా గొణిగింది ప్రమీల అతన్ని ఒదలకుండా

"కాసేపాగుదాం. దాన్నలాగో పోనియ్యండి" అన్నాడు రాజా. కాని పాముపోయే సూచనలేమీ కనబడలేదు. చీకటి ఎక్కువవుతోంది రాజా నెమ్మదిగా పక్కదారి తీశాడు. ప్రమీల అతని జబ్బ పట్టుకుని వెనక్కి వెనక్కి చూసుకుంటూ అడుగులు వేసింది.

* * *

ఎనిమిదిన్నరకి బస్స్టాండ్‌లో దిగి యిద్దరూ యింటివేపు నడిచారు.

"అబ్బ! ఏమిటండీ ఆ గోల! యీ చుట్టుపట్ల ఫిష్ మార్కెట్ ఏదన్నా ఉందా!"

"ఆ గోల ఫిష్ మార్కెట్టునుంచి కాదండి. మా క్లబ్బునుంచి"

"నేను నమ్మను" అంది ప్రమీల.

"నమ్మినా నమ్మకపోయినా అది అంతే" నిక్కచ్చిగా చెప్పాడు రాజా.

ఆ మర్నాడుదయం ప్రమీలని బస్ ఎక్కించడానికి స్టాండ్‌కి వెళ్ళాడు రాజా. "మీవల్ల యిక్కడంతా చాలా చూశాను. థాంక్స్. ఈ ఒక్క రోజు నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను" చెయ్యి ఊపుతూ క్రిందనున్న రాజుతో అంది ప్రమీల.

"అందమైన నీలంరంగు బస్సు అందమైన అమ్మాయిని మోసుకుని వెళ్ళిపోయింది, దాని మొగుడు దాన్నెత్తుకుపోయాడన్నట్టు!" రాజా నిట్టూర్చాడు. ఆ ఒక్క రోజు తన జీవిత చరిత్రలో ఎవరన్నా రాస్తే బంగారపు టక్షరాల్తో చెక్కింపించాలనుకున్నాడు. ఆ ఒక్క రోజూ తను యీ భూలోకానికంతకీ చక్రవర్తి అనిపించింది మళ్ళా తను, తన గాలుపు రాళ్ళపని, వెట్టిచాకిరి తయారు. అంతా, ఏక్ దిన్ కా....!